

తాడేపల్లిగూడెం ఎఎంసి ఛైర్మన్‌గా ముప్పిడి

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ముప్పిడి సంపత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గౌరవ ఛైర్మన్‌గా ఉంటారు. ఛైర్మన్‌గా ముప్పిడి సంపత్ కుమార్, వైస్‌ఛైర్మన్‌గా కె.పెంటపాడు గ్రామానికి చెందిన బోడగిరి సత్యనారాయణ (చినబాబు), డైరెక్టర్లుగా సలుమూరి సూర్యప్రకాష్, జాలప్రి నాగేశ్వర రావు, మద్దుకూరి సుబ్బలక్ష్మి, కండెల్లి వెంకటలక్ష్మి, నీలపాల విజయలక్ష్మి, గోపే కనకదుర్గ, గార్లపాటి వీరకుమార్, షేక్ వలీబాష, చినమిల్లి వెంకటలక్ష్మి, లక్ష్మీచంద్ర, నున్న శ్రీనాగలక్ష్మి, దెందుకూరి వెంకట సూర్యనారాయణ రాజు, కర్రి వరహాల రెడ్డితో పాటు పెంటపాడు మండలం ముదునూరు సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ ఆఫీసర్, తాడేపల్లిగూడెం అగ్రికల్చర్ ఎడి, పడాల గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు. ఏడాది పాటు ఈ పాలకవర్గం పదవీకాలం ఉంటుంది.

అండుగంటిన కాలువలు.. ఎండుతున్న పంటలు

దిక్కుతోచని స్థితిలో రైతులు - వెయ్యి ఎకరాల్లో వరిచేలకు నీటి కొరత - ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - మొగల్తూరు

వర్షాభావం రైతులను నట్టేట ముంచింది. ఇప్పటి వరకూ పంటను కాపాడుకుంటూ వచ్చిన రైతులకు చివరకు చినుకుజాడ లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మండలంలోని పంటకాలువలు కూడా అడుగంటడంతో శివారు పంటలకు నీరులేక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం ఈ చేలన్నీ పొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో నీరందకపోతే పంట దిగుబడిపై ఆశ వదులుకోవాల్సిందేనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నరసాపురం ప్రధానకాలువకు కవిటంవద్ద జిన్నూరు కాలువ ప్రారంభమవుతుంది. ఈ కాలువ మడుగు పోలవరం, వడ్లవానిపాలెం, వెలివిలి, మల్లవరం, కొప్పర్రు తదితర గ్రామాల మీదుగా శేరేపాలెం టెయిల్ డ్యామ్ వరకూ సుమారు 35 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. ఈ కాలువలకు శివారున ఉన్న శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో వరిచేలకు నీరందడంలేదు. వేసవిని తలిపిస్తూ ఎండలు ఉండటంతో వరిచేలు ఎండిపోయి నెర్రలు తీశాయి. వరి దుబ్బులు దెబ్బతింటున్నాయి.



నెర్రలు తీసిన వరిపైరును చూపుతున్న రైతులు



కొద్దిపాటి నీరు కూడా పారకుండా కాలువల్లో పేరుకుపోయిన తూడు

కాలువల్లో పేరుకుపోయిన తొలగని తూడు, నాచు

జిన్నూరు కాలువ ఆయకట్టు పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు తాగు, సాగు, ఇతర అవసరాలకు ఈ నీరే ఆధారం. కాలువలో పెరిగిన తూడు, నాచు తొలిగించాల్సిన గుత్తేదారు వాటి నిరోధానికి రసాయనాలు చల్లుతున్నారు. దీని ప్రభావంతో అవికుళ్లి నీటి అడుగుభాగానికి దిగబడుతున్నాయి. వాటిని బయటకు తీయకపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది.

పరిష్కారానికి చర్యలు

బి.కృష్ణకుమార్, ఎఇ, నీటిపారుదలశాఖ నరసాపురం

శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల పరిధిలోని వరిచేలకు సాగునీరందించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకుంటాము. కాలువలో తూడు, నాచు తొలగించి సమస్య పరిష్కారానికి గుత్తేదారుకు తగు ఆదేశాలు జారీచేస్తాను.

దళిత పేటల్లో శ్మశానవాటిక సమస్య పరిష్కరించాలి

30న కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దళితులు ఎదుర్కొంటున్న శ్మశాన వాటికల సమస్యను తక్షణం పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తూరు గ్రామం ఇందిరానగర్‌లో శ్మశానవాటికను క్రాంతిబాబు శనివారం పరిశీలించారు. దళితులను కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లాలో దళితులు నేటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారనడానికి కొత్తూరు ఇందిరానగర్ పరిస్థితే నిదర్శనమన్నారు. ఏళ్ల తరబడి తమ పూర్వీకుల నుంచి జీవిస్తున్న దళిత పేటకు నేటికీ శ్మశానవాటిక కేటాయించకపోవడం దారుణమన్నారు. ఎవరైనా చనిపోతే దళితులు అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. జిఒ నెం.1235 ప్రకారం రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి శ్మశాన వాటికకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

30న కలెక్టరేట్ వద్ద ధర్నా

జిల్లావ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న శ్మశానవాటిక, ఇళ్లస్థలాల, డ్రెయినేజీ, రోడ్ల సమస్యలపై ఈ నెల 30వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన దళిత రక్షణ యాత్రలో దళిత పేటల్లో అనేక సమస్యలను గుర్తించామన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల గడుస్తున్నా నేటికీ దళితులు అభివృద్ధికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దళితులు నేటికీ కులవివక్షను ఎదుర్కొంటున్నారన్నారు. చనిపోయిన తర్వాత ఖననం చేసే విషయంలో కూడా దళితుల పట్ల వివక్ష కొనసాగుతుందనడానికి నేటికీ స్మశాన వాటికలు లేకపోవడమేనన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాబూరావు, వెంకటేశ్వరరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్లు 14,47,509 మంది

పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో నూరు శాతం ఖచ్చితమైన, పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై చర్చించారు. తొలుత కలెక్టర్ ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను ప్రశాంతి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా 2023 అక్టోబర్ 27 నాటికి జిల్లాలో 14,47,509 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుష ఓటర్లు 7,09,608 మంది, మహిళా ఓటర్లు 7,37,824 మంది కాగా, థర్డ్ జెండర్ ఓటర్లు 77 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో భాగంగా ఓటర్ల జాబితాలో ఏవైనా క్లెయిములు, అభ్యంతరాలుంటే ఈ ఏడాది డిసెంబర్ తొమ్మిదో తేదీలోపు తెలియజేయాలన్నారు. 26లోపు డిస్పోజల్ ఆఫ్ క్లెయిమ్స్ అండ్ అబ్జక్షన్స్ చేస్తామని, జనవరి ఐదో తేదీన ఓటర్ల జాబితా ఫైనల్ పబ్లికేషన్ చేస్తామని తెలిపారు. అర్హులై ఉండి ఎవరికైనా ఓటరు జాబితాలో పేరు రాకపోయినా, వారి పేరు తొలగించినా ఆన్‌లైన్ ద్వారా కూడా క్లెయిమ్స్, అభ్యంతరాలు తెలియజేయొచ్చన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపుపై నాలుగు రోజులు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని, ఈ క్యాంపెయిన్‌లో బిఎల్ఒలు పాల్గొంటారని తెలిపారు. రాజకీయ పార్టీల వారు బి.ఎల్.ఎ లను నియమించుకోవాలని తెలిపారు. ఆచంట నియోజకవర్గంలో 87,602 మంది పురుష ఓటర్లు, 89,839 మంది మహిళా ఓటర్లు కలిపి మొత్తం 1,77,441 మంది ఉన్నారన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో 94,391 మంది పురుష ఓటర్లు, 97,936 మంది మహిళా ఓటర్లు, 10 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 1,92,337 మంది ఉన్నారన్నారు. నరసాపురం నియోజకవర్గంలో 82,545 మంది పురుష ఓటర్లు, 83,020 మంది మహిళా ఓటర్లు, ఒక థర్డ్ జెండర్ ఓటరు కలిపి మొత్తం 1,65,566 మంది ఓటర్లు ఉన్నారన్నారు. భీమవరం నియోజకవర్గంలో 1,20,857 మంది పురుష ఓటర్లు, 1,27,428 మంది మహిళా ఓటర్లు, 46 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. ఉండి నియోజకవర్గంలో 1,08,235 మంది పురుష ఓటర్లు, 1,12,627 మంది మహిళా ఓటర్లు, ఇద్దరు థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,20,864 మంది ఉన్నారన్నారు. తణుకులో 1,13,226 మంది పురుష ఓటర్లు, 1,19,343 మంది మహిళా ఓటర్లు, ఆరుగురు థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,32,575 మంది, తాడేపల్లిగూడెంలో 1,02,752 మంది పురుష ఓటర్లు, 1,07,631 మంది మహిళా ఓటర్లు, 12 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,10,395 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు ఎ.సన్యాసిరావు, వివిధ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాంబాబు, కాటూరి కరుణాకర్, తమలంపూడి వంశీ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస వర్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకట్రావు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. అనేక మున్సిపాల్టీల్లో కాంట్రాక్టు కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలు నెలలు తరబడి చెల్లించడం లేదని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సొమ్మును వారి ఖాతాలో రెగ్యులర్‌గా జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ధనాల దానయ్య, నాయకులు కొడమంచిలి బాబు, గొడవ మిస్సమ్మ నాయకత్వం వహించారు. హామీలను అమలు చేయని పక్షంలో మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని నాయకులు తెలిపారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

నూతన కమిటీ వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం

నూతన కమిటీ వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వయోవృద్ధుల కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడారు. జిల్లాలో వృద్ధుల సంక్షేమానికి జిల్లా కమిటీ ఏర్పాటు మంచి నిర్ణయమన్నారు. క్రమం తప్పకుండా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాలు జరుగుతాయని, అందరూ హాజరై వృద్ధుల సంక్షేమానికి మంచి సేవలందించాలన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమం విషయంలో ఎన్నో ఫిర్యాదులోస్తున్నాయని, వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. వృద్ధుల సంక్షేమ అప్పీలేట్ ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2007 వృద్ధులు, తల్లిదండ్రుల రక్షణ, పోషణ చట్ట ప్రకారం ప్రతీబాధిత వృద్ధతల్లిదండ్రులకు సెక్షన్ 22/2 ప్రకారంవారి ఆస్తులకు, వారికి రక్షణ కల్పించాల్సి ఉందని, దీనికి పోలీసు శాఖ సహకారం అవసరమన్నారు. ఇటీవల ఆస్తులు విలువలు పెరగడం, పెళ్లిచేసి పంపేసిన కుమార్తెలకు ఎంతోకొంత రాయాలనే పునరాలోచన, బిడ్డలకు ఆస్తులు రాసిన తర్వాత వారు నిరాదరించడం వంటి కారణాలతో సెక్షన్ 23 ప్రకారం ఆస్తులు బదలాయించమనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, ప్రతిభావంతులు సంక్షేమ సహాయ సంచాలకులు జిసిహెచ్.ప్రభాకర్, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, సుగుణ రాజు, నరసాపురం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు, కన్సిలియేషన్ అధికారులు డి.వెంకట సురేష్ చంద్రాజీ, ఎం.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెంపరాల నారాయణమూర్తి, కె.రామచంద్రరావు, సభ్యులు ఎం.కేశవోలు, బోణం పాండురంగారావు, ఎం.పుష్పాంజలి, ఎ.నాగ సూర్య సత్యనారాయణ పాల్గొన్నారు.

విశ్వ జనని ప్రతాప్‌రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు

ప్రారంభించిన వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ప్రసాద్ రాజు - ట్రస్ట్ ఏర్పాటు అభినందనీయం : సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

అభ్యుదయ వాది, మానవతావాది, సిపిఎం సానుభూతిపరులు పిన్నమ్మ రాజు ప్రతాప్‌రాజు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వైసిపి సీనియర్ నేత పిన్నమరాజు పృథ్వీరాజు, భారతీదేవి విస్సాకోడేరులో విశ్వజనని ప్రతాప్‌రాజు ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్‌ను వసుధ ఫౌండేషన్ కన్వీనర్, రిటైర్డ్ డిఇఒ ఇందుకూరి ప్రసాద్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రాజు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రారంభించి మాట్లాడారు. నిస్వార్ధపరుడు ప్రతాప్‌రాజు పేరున కుటుంబ సభ్యులు ట్రస్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంలో ప్రతాప్ రాజు అనేక సేవా కార్యక్రమాలు చేశారని, ముఖ్యంగా మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని తెలిపారు. సాటివారికి సేవ చేయాలనే ఆలోచనతో ప్రతాప్‌రాజు ఉండేవారని, ఆయన ఆశయాలను కొనసాగించే విధంగా కుటుంబ సభ్యులు ముందుకు సాగడం గొప్ప విషయమన్నారు. రిటైర్డ్ డిఇఒ ప్రసాద్ రాజు మాట్లాడుతూ మానవతావాది ప్రతాప్‌రాజు చిరస్మరణీయులన్నారు. ఆయన పేరు చిరస్థాయిగా నిలిచే విధంగా ట్రస్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్‌కు అన్ని విధాలా ఫౌండేషన్ నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతాప్ రాజు మిత్రుడు గొరగనమూడి మాజీ సర్పంచి చెల్లబోయిన పాపారావు మాట్లాడుతూ ప్రతాప్ రాజు గ్రామం అభివృద్ధి చెందాలని నిరంతరం తపనతో ఉండేవారని గుర్తు చేశారు. ఆ విధంగా కుటుంబ సభ్యులు నిరంతరం కోరుకోవడం అభినందనీయమన్నారు. తన మిత్రుడు పేరున ట్రస్ట్ ఏర్పాటు చేయడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ట్రస్ట్ సేవలు కొనసాగింపునకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ప్రతాప్‌రాజు సోదరుడు, వైసిపి సీనియర్ నేత పృథ్వీరాజు మాట్లాడుతూ తన సోదరుడు ప్రతాప్ రాజు ఆశయ సాధనకు నిరంతరం కుటుంబ సభ్యుల సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. ట్రస్ట్ అభివృద్ధి చేసి నిరుపేదలకు నిరంతరం సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ రాజ్ కుటుంబ సభ్యులు శ్రీరామరాజు, గాదిరాజు రంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, గాదిరాజు సూర్యనారాయణ రాజు, భూపతి రాజు లక్ష్మణ రాజు, ఆశ్రయ, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రతాప్‌రాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బలరాం, కుటుంబ సభ్యులు, నేతలు

స్ఫూర్తిదాయకం వాల్మీకి జీవితం

ప్రజాశక్తి - భీమవరం

వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రామాయణం వంటి మహాగ్రంథాన్ని మనకు అందించిన వాల్మీకి మహర్షి చిరస్మరణీయులని కొనియాడారు. వారిజీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, బిసి వసతి గృహాల సంక్షేమ అధికారులు, బిసి వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

తీన్మార్ కళాకారులను డప్పు కళాకారులుగా గుర్తించి గుర్తింపు కార్డులివ్వాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. శనివారం తీన్మార్ కళాకారుల సమస్యలపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లాలో డప్పు కళాకారులతో పాటు అదే వృత్తిపై ఆధారపడి పనిచేసే తీన్మార్ కళాకారులు ప్రతి గ్రామంలో ఉన్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మారుతున్న అధునాతన సాంకేతిక అభివృద్ధిలో భాగంగానే తీన్మార్ ముందుకు వచ్చిందన్నారు. తీన్మార్ కళాకారులను కూడా ప్రభుత్వం గుర్తించాలని తెలిపారు. డప్పు, తీన్మార్ కళాకారులకు 45 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కళాకారుడికీ సంవత్సరానికి డప్పు, గజ్జెల, డ్రెస్సులు ఇస్తున్నట్లు ప్రభుత్వం జిఒ విడుదల చేసినా నేటికీ అమలు కావడం లేదన్నారు. తరతరాలుగా ఇదే వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న డప్పు కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం, పై అధికారులు డప్పు కళాకారులకు అండగా కొన్ని పథకాలు పెడుతుంటే జిల్లా అధికారులు మాత్రం కేవలం ప్రకటనలు ఇచ్చి తూతూమంత్రంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అర్హులైన కళాకారులకు తక్షణం గుర్తింపు కార్డులివ్వాలని క్రాంతి బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఖండెల్లి కృష్ణ, డప్పు కళాకారులు పాల్గొన్నారు.



జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కెవిపిఎస్ నేతలు

గుర్తుకొస్తున్నాయి..!

మరో ఆరు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో నేతలకు ఫీవర్ మొదలైంది. అధికార పక్ష ప్రజాప్రతినిధులు వీలైనంత వరకూ జనంలో ఉండే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే ప్రభుత్వం గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న ఆరోగ్య సురక్ష అంటూ పలు కార్యక్రమాలు చేపట్టిన సంగతి తెలిసిందే. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ఎంఎల్‌ఎలు ఎక్కువగా హాజరు కావడం, ఆపై శిబిరం పూర్తయ్యే వరకూ అక్కడే ఉండి అందరినీ పలుకరించి ప్రభుత్వ పథకాల ప్రచారానికి వేదికగా ఉపయోగించుకోవడం ఎక్కువగా కన్పిస్తోంది. దీంతోపాటు ప్రస్తుత సమస్యలతోపాటు గతంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను జనం ప్రస్తావించగానే 'గుర్తున్నాయి' అంటూ నేతలు సమాధానమిస్తున్నారు. రెండు సంవత్సరాలు కరోనా ఇబ్బందుల వల్ల ఇచ్చిన హామీలన్నీ అమలు చేయలేకపోయామని సర్ది చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద మీకు ఇంత సొమ్ము అందిందిగా అని ముక్తాయించి ఈసారి గెలవగానే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామంటూ ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. అయితే రోడ్లు, తాగునీరు, ఉపాధి, అధిక ధరలు వంటి అంశాలపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలను నేతలు నీళ్లు నములుతున్నారు. రెండు జిల్లాల్లో రోడ్ల వ్యవస్థ అధ్వానంగా మారిన సంగతి తెలిసిందే. సిఎం జగన్ సాక్షాత్తూ గడువులు ప్రకటిస్తున్నా రోడ్ల స్వరూపం మారకపోవడం ఈ ప్రభుత్వానికి మాయని మచ్చగా మారింది. ఇక మెట్టలో తాగునీటి సమస్య, డెల్టాలో కలుషిత నీటి సమస్య వెంటాడుతున్నాయి. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా తొలుత పట్టణాలకు గోదావరి నీటిని అందించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని నేతలు ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. ప్రధానంగా తరచూ ప్రతిపాదనలు మార్చడం, నిధులు మంజూరయ్యాయని ప్రకటించడం మినహా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కాని దుస్థితి నెలకొంది. ఫలితంగా డెల్టా వాసులు నిరంతరం తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీటిని తాగిన పేదలు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ప్రధానంగా కేన్సర్ కేసులు పెద్దసంఖ్యలో డెల్టాలో నమోదవుతుండడం ఆందోళనకర అంశంగా ఉంది. ఉపాధి లేమి, అధిక ధరలు జనానికి భారంగా పరిణమించాయి. ఇప్పటికీ యువత గ్రామీణ ప్రాంతంలో పనుల్లేక పట్టణాలకు రోజూ వచ్చి దుకాణాల్లో పని చేయడం చేస్తున్నారు. దీనికితోడు ఆశాకాన్నంటిన ధరలు ఇబ్బందికరంగా పరిణమించాయి. విద్యుత్ ఛార్జీల భారం హాట్ టాపిక్‌గా మారింది. ఎక్కడికెళ్లినా దీనిపై ప్రశ్నలు తప్పడం లేదని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. దీనికితోడు స్థానికంగా ఇచ్చిన హామీలు, పేరుకుపోయిన సమస్యలు నేతల తలకు చుట్టుకుంటున్నాయనడంలో ఎటువంటి అతిశయోక్తీ లేదు. దీంతో జనంలో అసంతృప్తి పారదోలేలా.. వారికి సన్నిహితంగా ఉండేలా నిరంతంర ఏదోక కార్యక్రమంలో పాల్గొంటూ జనంతో నేరుగా మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. దీనిలో నరసాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు, ఉంగుటూరు, చింతలపూడి, కైకలూరు, నూజివీడు, దెందులూరు ఎంఎల్‌ఎలతోపాటు టిడిపికి చెందిన ఉండి, పాలకొల్లు ఎంఎల్‌ఎలు ముందంజలో ఉన్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఎంఎల్‌ఎలు క్షేత్రస్థాయి పర్యటనలతోపాటు అధికారులతో తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయడం, ప్రారంభోత్సవాల్లోనూ తలమునకలవుతున్నారు. మొత్తంగా ఆయా నియోజకవర్గాల్లో నేతలకు ఎన్నికల ఫీవర్ బలంగా సోకిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



'విహారం'లో విషాదం..!

విహార యాత్రల్లో విషాదాలు పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంత ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేశాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో గోదావరిలో నీట మునిగి నలుగురు, పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని పేరుపాలెం బీచ్‌లో నీట మునిగి ముగ్గురు దుర్మరణం పాలవ్వడం అందరినీ కలిచివేసింది. వరుస సంఘటనల్లో మృతువ్యాత పడిన వారంతా తణుకు పరిసర ప్రాంతాల వారే కావడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాధారణంగా జిల్లాలో అధికారులు కార్తీక మాసంలో బీచ్‌లు, నదీ ప్రాంతాల్లోని పిక్నిక్ స్పాట్‌ల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. పెరిగిన మానసిక ఒత్తిడి, యాంత్రిక జీవనం నుంచి బయట పడేందుకు జనం తక్కువ ఖర్చుతో పూర్తయ్యే సమీప పిక్నిక్ స్పాట్స్‌కు నిరంతరం వెళ్లడం సర్వ సాధారణమైంది. తరచూ పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పుకునే అధికారులు, ప్రజాప్రతినిధులు సామాన్యులు వెళ్లే పిక్నిక్ స్పాట్‌లపై పెద్దగా దృష్టి సారించకపోవడం జనం మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా గోదావరి నది ప్రాంతాలు, బీచ్‌ల్లో సౌకర్యాలు మాటెలా ఉన్నా ప్రాణాలు కోల్పోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

పాలస్తీనాపై దాడులను ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇజ్రాయిల్ పాలస్తినాపై చేస్తున్న దాడులను ఖండిస్తూ వెంప గ్రామంలోని పెద్దపేట అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం సిపిఎం నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తినాపై మారణ హోమం చేయడం వల్ల మహిళలు, పిల్లలు అనేకమంది చనిపోయారన్నారు. ఇప్పటికైనా ఇజ్రాయిల్ హమాస్ కాల్పుల విరమణ పాటించి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంద మార్తమ్మ, శిరోమణి, నేతల కృపాదనం, పార్వతి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : పాలస్తినాపై ఇజ్రాయేలు యుద్ధాన్ని అందరూ ఖండించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక వెంకటేశ్వర సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఇప్పటి వరకూ ఈ యుద్ధంలో వేలాది మంది చనిపోయారన్నారు. భారత్ కూడా పాలస్తినాకు మద్దతివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కామన మునిస్వామి, గుబ్బల గోపి, బ్రహ్మాజీ, త్రిమూర్తులు, గార రంగారావు, నాగేంద్ర, గోవింద రాజు, బాబు పాల్గొన్నారు.

ఎన్నికల ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్ఎస్ఆర్ 2024 భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశామని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కెసిహెచ్.అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశామన్నారు. ఓటర్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో భాగంగా జాబితాల్లో ఏమైనా క్లెయిమ్స్ అభ్యంతరాలుంటే డిసెంబర్ 8వ తేదీలోపు తెలియజేయాలన్నారు. అర్హులై ఉండి ఓటర్ల జాబితాలో పేరు రాకపోయినా, వారి పేరు తొలగించినా తెలపాలని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 1,92,337 మంది ఓటర్లు ఉండగా వారిలో 94,391 మంది పురుషులు, 97,936 మంది మహిళలు, 10 మంది ట్రాన్స్ జెండర్స్, 84 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. డిసెంబర్ 26వ తేదీలోగా సదరు క్లైమ్‌లను పరిశీలించి 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రతినిధులు సూర్యప్రకాష్, జి.వెంకటేశ్వరరావు, వైసిపి ప్రతినిధులు సిహెచ్ సత్తిబాబు, వెంకటరత్నం, సురేష్, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటేనే భీమవరం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అభివృద్ధి అంటేనే భీమవరం అని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రూ.కోటి ఐదు లక్షలతో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో శనివారం ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా 34వ వార్డులో రూ.38 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అదే వార్డులో రూ.20.50 లక్షలతో బిటి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.37 లక్షల 50 వేలతో గోపీకృష్ణ టవర్స్ నుంచి రాయలం సీసీ రోడ్డు వరకూ నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. 38వ వార్డులో రూ.11.50 లక్షలతో ఆర్‌సిసి క్రాస్ పైప్ లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటేనే భీమవరం నియోజవర్గం అని అందరికీ గుర్తుకొచ్చే విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పేరిచర్ల విజయ నరసింహారాజు, కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - గణపవరం

రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసు బాబు అన్నారు. శనివారం సిహెచ్ అగ్రహారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కామన్ రకం రూ.2183 (గ్రేడ్‌ఎ రూ.2203)కు కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఆర్‌బికె ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ ఇప్పటికే పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసి ఈ క్రాఫ్ లిస్టులు కేంద్రాల వద్ద ఉండే విధంగా చూడాలని చెప్పారు. ఈ క్రాఫ్ చేసుకున్న రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. కళ్లాల వద్ద నుంచి ధాన్యం సేకరించి వారికి ప్రభుత్వం మద్దతు ధర అందించడంలో ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చుక్కా అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి జి.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ పి.లక్ష్మి, ఎంపిడిఒ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

ప్రజాశక్తి - కాళ్ల

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి ముదరకుండా జాగ్రత్త తీసుకునే అవకాశం ఉంటుందని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు జి.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు భీమవరం ఎస్‌ఆర్‌కె ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ పి.భువనేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ ఎక్కువగా ఉన్నాయన్నారు. ఏటా కోటి మంది ప్రపంచవ్యాప్తంగా చనిపోతుంటే కేవలం భారతదేశంలో 11 లక్షల మంది చనిపోతున్నారన్నారు. ప్రధానంగా బ్రెస్ట్ క్యాన్సర్ వల్ల ఎక్కువమంది చనిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్.వి.రంగరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు టెక్నాలజీని అందించేందుకు, గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నిర్మలదేవి, సీనియర్ అధ్యాపకులు సుబ్బరాజు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ నిమ్మల మానవత్వం

ప్రజాశక్తి - పాలకొల్లు

గర్భిణికి సకాలంలో వైద్యం చేయించి ఎంఎల్ఎ నిమ్మల మానవత్వం చాటుకున్నారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి శనివారం తెల్లవారుజామున గర్భిణి ప్రసవం నిమిత్తం వచ్చింది. అయితే వైద్యులు లేకపోవడంతో ఏంచేయాలో తెలియని పరిస్థితుల్లో ఆమె కుటుంబ సభ్యులు ఎంఎల్ఎకు ఫోన్ చేయగా వెంటనే స్పందించి ఎంఎల్ఎ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలందేలా చర్యలు తీసుకున్నారు. బయట నుంచి గైనకాలజిస్ట్, మత్తు మందు ఇచ్చే వైద్యులను రప్పించి గర్భిణి ప్రసవం జరిగేలా బాధ్యత తీసుకున్నారు. దీంతో ఆమె పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరావు తెలిపారు. లిఖితపూడి గ్రామ సచివాలయం వద్ద శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో రూ.40, లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోని లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.శివప్రసాద్ యాదవ్, తహశీల్దార్ ఎస్ఎం.పాజిల్, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: ఉల్లంపర్రు గ్రామంలోని మాంటిసోర్రీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, టిటిడి బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, యడ్ల తాతాజీ, మైఖేల్ రాజ్ పాల్గొన్నారు.

పోడూరు : ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే సిఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి అన్నారు. వద్దిపర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరు పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు మోగల్లు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పాలకోడేరు

తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు మోగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ - 14 విభాగంలో ఖోఖో క్రీడల్లో జివి భాస్కర్, డిఎన్ ప్రకాష్ అర్హత సాధించారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్‌కెఎస్.ప్రసాద్, ఎల్‌విడి ప్రసాదు అండర్-17 విభాగంలో ఎంపికయ్యారు. తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అండర్-14లో ఇద్దరు, అండర్-17 విభాగంలో కాకినాడలో జరగబోవు పోటీలలో ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచి కృష్ణకుమారి, పీసీ కమిటీ ఛైర్మెన్ జయంతి, ప్రధానోపాధ్యాయులు త్రినాథులు, వీరమల్లు రాంబాబు, గ్రామస్తులు అభినందించారు.

కష్టంతో కాదు.. ఇష్టంతో చదవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థుల చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు ఉందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 34వ వార్డులో శనివారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి దేశ, రాష్ట్ర భవిష్యత్ అని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యువత, విద్యార్థులను ప్రోత్సహించి వారికి బంగారు భవిష్యత్తు కల్పించడానికి అనేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా అమ్మఒడిని విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత దేశంలో మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించారని తెలిపారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరయ్యారు. మండల అధ్యక్షురాలు మైలాబత్తుల సోనీ అధ్యక్షత వహించారు. ముదునూరి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో అప్రోచ్ రోడ్ల లెవెలింగ్ పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. ఈ సంవత్సరం మండల పరిషత్ నిధులు నుండి రూ.1.73 కోట్ల నిధులు మంజూరు కాగా రూ.1.15 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇంకా రూ:35 లక్షలు పనులు చేయాల్సి ఉందన్నారు. గ్రామాల్లో చేపట్టే రక్షిత మంచినీటి పనులు కోసం రూ.6.44 కోట్ల నిధులు మంజూరు కాగా రూ.6.9 కోట్లతో మూడు చోట్ల రాఫిట్ ఫిల్టర్స్ బెడ్ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు మైలాబత్తుల సోనీ, మండల ఉపాధ్యక్షులు ఉంగరాల రమేష్ నాయుడు, ఎంపిడిఒ ఎస్.శివప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిని పాటించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరి ప్రస్తుతం పూత దశలో ఉందని, ఈ సమయంలో మంచు ఎక్కువగా కురిసినా, వర్షం పడినా అన్ని రకాలకు మానుకాయ తెగులు ఆశించే అవకాశం ఉందని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. శనివారం వ్యవసాయ పరిశోధన సంస్థలో రైతు భరోసా, శిక్షణ, సందర్శన నెలవారీ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి ప్రతినిధిగా ఎంవి.రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.భరతలక్ష్మి మాట్లాడుతూ పిఎల్ఎ 1100 రకం సాగుచేసిన పొలాల్లో కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. అధికారులు ఈ తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కూలీల కొరత అధికమించడానికి నేరుగా వెదజల్లే పద్ధతిని పెద్ద ఎత్తున రైతులు ఆచరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రతినిధి ఎంవి.రమేష్ సార్వాలో సుమారు 90 శాతం సాధారణ విస్తీర్ణం పూర్తయ్యిందని, తాడేపల్లిగూడెంలో కోతలు కూడా మొదలయ్యాయని, మిగిలిన ప్రాంతాల్లో నవంబర్ మూడో వారం నుండి ఎక్కువవుతాయని తెలిపారు. జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి వల్ల పంట ఎండిపోతున్నట్టు సమాచారం లేదని తెలిపారు.

జ్ఞాపక శక్తికి సైన్సు సంబరాలు దోహదం

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థి చెకుముకి సైన్సు సంబరాలు పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, చదువుపట్ల ఆసక్తిని పెంచుతుందని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్సు సంబరాల గోడ పత్రికలను ఎంపిడిఒ పి.పద్మజ, ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన పెంచేందుకు జెవివి 35 సంవత్సరాలుగా కృషి చేస్తోందని జన విజ్ఞాన వేదిక జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి ఉదయ్ కిరణ్ అన్నారు. ఈ సంవత్సరం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నవంబర్ 10న పాఠశాల స్థాయి, నవంబర్ 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో వచ్చే సంవత్సరం జనవరి 27, 28 తేదీలలో రాష్ట్రస్థాయి సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి చెకుముకి మండల కన్వీనర్ డి.సుధీర్, ఎన్ఆర్ఇజిఎస్ టిఎ ఎం.బాపూజీ పాల్గొన్నారు.

ఇరు గ్రూపుల మధ్య వివాదం

పది మందికి గాయాలు

ప్రజాశక్తి - ఆకివీడు

పాత గొడవల నేపథ్యంలో మద్యం మత్తులో తెలగపాముల సామాజిక తరగతి వారికీ, ముఠా కార్మికులకు మధ్య శనివారం మరోసారి వివాదం చెలరేగింది. స్థానికుల కథనం ప్రకారం ముఠా కార్మికులు తమ కార్యాలయం బయట కూర్చున్నారు. అదే సమయంలో తెలగపాముల సామాజిక తరగతికి చెందిన కొంతమంది యువకులు మద్యం సేవించి బార్ నుండి బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులను చూసిన వాళ్లు గతంలో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని దూషణకు పాల్పడ్డారు. దీంతో ఆగ్రహంతో కార్మికులు వారిపైకి దూసుకెళ్లారు. ఈ క్రమంలో ఇరువురూ కొట్లాడుకున్నారు. ఈ ఘటనలో సుమారు పది మంది గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఇరువురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగబాబు తెలిపారు.

ఎన్ఆర్ఇజిఎస్‌తో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేసుకోవచ్చని గరువు సర్పంచి ముదునూరి నాగరాజు అన్నారు. శనివారం పెనుమంట్ర, గరువు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఈ ఏడాది, గత ఏడాది ఎనిమిది లక్షల 90 వేల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. పెనుమంట్రలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక మాట్లాడారు. రూ.44.51 లక్షలు కూలీలకు, రూ.2.77 లక్షలు వివిధ భవనాల మెటీరియల్‌కు ఖర్చు చేసినట్టు తెలిపారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మారంపూడి బాపూజీ, ఎంపిటిసిలు, పెనుమంట్ర వార్డు సభ్యులు పాల్గొన్నారు.

46వ రోజుకు టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి - ఆచంట

అప్రజాస్వామిక ప్రభుత్వాన్ని జగన్మోహన్ రెడ్డి నడుపుతున్నారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా ఆచంటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 46వ రోజు చేరుకున్నాయి. అనంతరం పితాని మాట్లాడుతూ ప్రశ్నించే ప్రతి పక్షాలను హత్యా రాజకీయాలు చేయాలనే కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాలను ముట్ట పెడతారా అని ప్రశ్నించారు. వైసిపి దుర్మార్గమైన ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. తమ నాయకుడిని ఎలా రక్షించుకోవాలో తమకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, టిడిపి నేతలు, గొడవర్తి శ్రీరాములు, కేతా మీరయ్య, గుబ్బల మాధవరావు, అల్లం సూర్యప్రకాశరావు

పాలకొల్లు : స్కిల్ స్కాం కేసులో చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల అకౌంట్లోకి ఒక్క రూపాయి చేరిందని జగన్ దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఛాలెంజ్ చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 46వ రోజుకు చేరాయి. గాంధీ బొమ్మ సెంటర్, ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద శిబిరంలో పోడూరు మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో కూర్చున్నారు. ఎంఎల్ఎ రామానాయుడు దీక్షా శిబిరాన్ని సందర్శించి నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమించారు. పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 3వ వార్డులో విద్యుదాఘాతంతో ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ హైదర్ అబ్బాస్ (24) మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఇటీవలే ఆయన ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఓ ఇంటిలో డ్రిల్లింగ్ చేస్తుండగా కరెంట్ పోయింది. ఆ ప్లగ్‌లు తీస్తుండగా కరెంట్ రావడంతో అక్కడికక్కడే కరెంట్ షాక్‌తో కుప్పకూలాడు. మృతదేహాన్ని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అబ్బాస్ మృతదేహాన్ని ఆయన సొంత ఊరు కోనసీమ జిల్లాలోని నగరానికి తరలిస్తారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అబ్బాస్ మృతదేహాన్ని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ముస్లిం పెద్దలు మొహ్మద్ జానీ, మహమ్మద్ జానీ, షేక్ సిలార్ పరామర్శించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - వీరవాసరం

భీమవరం నియోజకవర్గ భవిష్యత్తు గ్యారెంటీ అవగాహన సదస్సును శనివారం వీరవాసరంలో నిర్వహించారు. మండల టిడిపి క్లస్టర్, యూనిట్,బూత్ స్థాయి నాయకులకు ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నుంచి జనసేన నాయకులతో కలిసి క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌ఛార్జులు తమ బూత్ పరిధిలోని భవిష్యత్తు గ్యారెంటీ చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందని తెలిపారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చంద్రబాబును ఏదోరకంగా అరెస్టుచేసి జైల్లో ఉంచితే టిడిపి నాయకులు కార్యకర్తలు తనకు లొంగిపోతారనుకోవడం అవివేకమని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపల్లి వెంకట్ మాట్లాడారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్ వీరవల్లి శ్రీనివాస్, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

భీమవరం: భీమవరం నియోజకవర్గ భవిష్యత్తు గ్యారెంటీ అవగాహన సదస్సు భీమవరం మండల టిడిపి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులకు పట్టణంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నవంబర్ 1వ తేదీ నుంచి జనసేన నాయకులతో కలిసి క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌ఛార్జులు తమ బూత్ పరిధిలోని భవిష్యత్తు గ్యారెంటీ లబ్ధిదారులతో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ వైసిపి ముఖ్యమంత్రి జగన్ చంద్రబాబును ఏదోరకంగా జైల్లో ఉంచితే టిడిపి నాయకులు, కార్యకర్తలు తనకు లొంగిపోతారనుకోవడం అవివేకమన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్ మాట్లాడారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృధ్వీశంకర్, నేతలు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర దేనికో చెప్పాలి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెన్నేటి సురేష్ మాదిగ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితి గతుల్లో ఏం మార్పు తీసుకొచ్చారని సామాజిక సాధికార యాత్ర చేస్తున్నారో చెప్పాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెన్నేటి సురేష్ మాదిగ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. అణగారిన వర్గాల్లో కొందరికి పదవులిచ్చి అధికారం ఇవ్వకుండా చేసి, కార్పొరేషన్లు విభజించి నిధులు ఇవ్వకుండా దళితులను ఉద్ధరించామంటూ ప్రచారం చేయడం దారుణమని తెలిపారు. కొంతమంది వైసిపి దళిత నాయకులు వారి పదవులను కాపాడుకోవడం కోసం, కొత్తగా పదవులు పొందడం కోసం జాతిని తాకట్టు పెట్టి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా దళితులకు రావాల్సిన నిధులు, రాయితీలు, హక్కులు ఈ రాష్ట్రంలో నిర్వీర్యమైపోయాయని విమర్శించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆర్‌డిఒ శ్రీనివాసులు రాజు అన్నారు. అధికారులు పూర్తి బాధ్యత తీసుకొని పనులు త్వరగా చేపట్టి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. విస్సాకోడేరు పైపులచెరువు ప్రాంతంలోని పాలకోడేరు మండలం జగనన్న లేఅవుట్‌ను ఆర్‌డిఒ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసేందుకు గుత్తేదారుడుతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ సి.ఆనంద్‌కుమార్, ఇఇ వేణుగోపాల్, తహశీల్దార్ షేక్ హుస్సేన్, హౌసింగ్ ఎఇ నరసింహారావు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : పేదల ఇళ్ల నిర్మాణంలో పనులు వేగవంతం చేయాలని ఆర్‌డిఒ శ్రీనివాసరాజు అన్నారు. శనివారం స్థానిక పైపులు చెరువు వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనుల ప్రాంతాన్ని సందర్శించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పనులు విధానాలపై ఆ ప్రాంతంలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో తారకరామా కన్స్ట్రక్షన్ నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన ఆయన కన్స్ట్రక్షన్ వైస్ ఛైర్మన్ పళ్ల తారకరామ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో తారకరామా కన్స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ పళ్ల ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్ శ్యామల, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

లిటిల్‌బడ్స్ విద్యార్థుల మానవత్వం

బ్లైండ్ హాస్టల్‌కు రూ.75 వేల విరాళం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవారంలో అగ్రగామి విద్యాసంస్థ లిటిల్‌బడ్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. తమ వంతు సాయంగా తల్లిదండ్రులు, ప్రజల నుండి విరాళాలు సేకరించి రావులపాలెం శుభోదయం బ్లైండ్ హాస్టల్ నిర్వహణ నిమిత్తం రూ.75 వేలను ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కురెళ్ల నరసింహారావు చేతుల మీదుగా శనివారం హైస్కూల్ వద్ద హాస్టల్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ తమ విద్యార్థులు సమాజసేవలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మళ్లీ మొదటికి 'చెత్త' సమస్య

అర్ధరాత్రి భారీగా మంటలు - స్థానికుల నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

పట్టణంలో చెత్త సమస్య మళ్లీ మొదటికొచ్చింది. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి అగ్నిమాపక కేంద్రం వెనుక భాగంలోని ఖాళీ స్థలంలో నగర పంచాయతీలోని చెత్త డంపింగ్ చేస్తున్నారు. అయితే శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఒక్కసారిగా చెత్తకు భారీగా మంటలు వచ్చాయి. దీంతో ఆ ప్రాంతం మొత్తం పొగ ఆవరించడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. అలాగే దగ్గరలోని ఆసుపత్రిలో రోగులు ఇబ్బందులు పడ్డారు. అగ్నిమాపక సిబ్బందికి తెలిపినా స్పందించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చెత్త డంపింగ్ చేసే మార్గంలో చెత్త వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. సంఘటనా స్థలానికి కమిషనర్ చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. జెసితో మాట్లాడి మాట్లాడి ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేస్తామని, వారం రోజులు సమయం ఇవ్వాలని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు.

కచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఉండి

అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో నూరు శాతం కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జిల్లా గ్రామ పంచాయతి అధికారి జివికె.మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మల్లికార్జునరావు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్టోబర్ 27వ తేదీ నాటికి ఉండి నియోజకవర్గంలో 2,20,864 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుష ఓటర్లు 1,08,235 మంది, మహిళా ఓటర్లు 1,12,627 మంది ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏవైనా క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు తెలియజేయాలన్నారు.

మొగల్తూరులో వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం కొద్దిపాటి వర్షం పడింది. గత కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతల ప్రభావంతో ఉక్క పోతతో ప్రజలు అల్లాడారు. కొద్దిపాటి వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. ప్రజలు ఉక్క పోత నుంచి ఉపశమనం పొందారు.

జనసేన పోడూరు అధ్యక్షులుగా హరీష్

ప్రజాశక్తి - పోడూరు

జనసేన పోడూరు మండల అధ్యక్షులుగా రావి హరీష్ బాబును నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాష్ నియమించారు. శనివారం జరిగిన మండల స్థాయి విస్తృత సమావేశంలో సూర్య ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో జనసేనను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్, ఆచంట వైస్ ఎంపిపి యర్రగొప్పుల నాగరాజు, ఎంపిటిసి ముకమట్ల కృష్ణకాంత్, జవ్వది బాలాజీ, కొండవీటి శ్రీనివాస్ ఆయనను అభినందించారు.

30న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

దళిత కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి కోరుతూ ఈనెల 30న కలెక్టర్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కప్పల రత్నరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని దళితకాలనీల్లో మౌలిక సదుపాయాల్లే అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

గూడెంలో రక్తదాన శిబిరం

తాడేపల్లిగూడెం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో శశి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయేల్ మాట్లాడుతూ ఒక దాత ఇచ్చిన రక్తం వల్ల ముగ్గురు జీవితాలను కాపాడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డా.మొహమ్మద్ ఇస్మాయేల్ పాల్గొన్నారు.

భీమవరంలో చెస్ పోటీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

క్రీడలు మానకోల్లాసానికి దోహదపడతాయని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. టూ టౌన్‌లోని, యూత్ కల్చరల్ అసోసియేషన్ వద్ద శనివారం జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీల ఆధ్వర్యంలో యూత్ కల్చరల్ అసోసియేషన్ సౌజన్య సహకారంతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ చెస్ పోటీలను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి యూత్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షులు భీమారావు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు మాదాసు కిషోర్, యూత్ కల్చరల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పేరి చర్ల వెంకట శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

బాధితునికి సాయం

మొగల్తూరు: ఆపదలో ఉన్న వారికి కొవ్వలి ఫౌండేషన్ అండగా ఉంటుందని సంస్థ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలం రామన్నపాలెం పంచాయతీ జెట్టిపాలంకు చెందిన గ్రంధి కనకదుర్గ ప్రసాద్ పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయనకు నెలకు సరిపడా మందులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు నిమ్మకాయల గోపాలరావు, మూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

సాహిత్యంలో రంగరాజుది విజయబావుటా

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్రస్థాయి బహుమతి అందుకున్న ఉండి లయిన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ గాదిరాజు రంగరాజు అభినందనీయుడని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం రాత్రి ఉండి లయన్స్ క్లబ్ హాలులో జరిగిన అభినందన సభలో రంగారాజును సత్కరించారు. క్లబ్ అధ్యక్షరాలు వేగేశ్న అనంతలక్ష్మి అధ్యక్షతన ఈ సభ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్ కళ మాట్లాడుతూ రంగరాజు మాస్టర్ లయిన్స్ క్లబ్ సభ్యులు కావటం గర్వకారణమన్నారు. ఇప్పటికే ఎన్నో పురస్కారాలు, బహుమతులు సాధించారని చెప్పారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు మాట్లాడుతూ ఇటు సమాజ సేవ చేస్తూ అటు సాహిత్యంలో కూడా మంచి కృషి చేయటం ఆయన ప్రతిభకు తార్కాణమన్నారు. అనంతరం రంగరాజు మాట్లాడుతూ సాహిత్యంలో మరింత కృషి చేస్తానని, తనను సత్కరించినందుకు క్లబ్ కార్యావర్గానికి, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు భూపతిరాజు హరనాధ్ రాజు, బొండాడ సూర్య బ్రహ్మానందం, కలిదిండి సీతారామరాజు, నంబూరి కాశీ విశ్వేశ్వరావు, పెన్మెత్స రంగప్రసాద్ రాజు పాల్గొన్నారు.